క్లుప్తంగా

ప్రత్యేక అలంకరణలో గంగమ్మతల్లి



చింతకొమ్మదిన్నె : కొత్తపేట–బుగ్గలేటిపల్లి సరిహద్దుల్లోని గంగమ్మతల్లి ఆలయంలో ఆదివారం అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలతో పాటు అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక పట్టు వస్త్రాలతో అమ్మవారిని అలంకరించారు. కోర్కెలు తీరిన భక్తులు అమ్మవారికి ముద్దలను ఏర్పాటు చేసి ఆభరణాలను, పట్టు వస్త్రాలను కానుకలుగా సమర్పించారు. ఆలయ చైర్మన్ పార్వతమ్మగారి విశ్వనాథ్‌రెడ్డి, ఆలయ కార్యనిర్వహణ అధికారి సురేష్‌కుమార్‌రెడ్డిలు ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలోని పచ్చని చెట్ల మధ్య బంధుమిత్రులతో విందు భోజనాలను ఆరగించారు. అలాగే ఆలయ సమీపంలోని ఆలయాలలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఏర్పాట్లు సిద్ధం

కమలాపురం : పట్టణంలోని రైల్వే గేటు సమీపంలో వెలసిన శ్రీరాధాకృష్ణ మందిరంతో పాటు మండలంలోని రామాపురంలో వెలసిన శ్రీ మోక్ష నారాయణస్వామి ఆలయాల్లో ఉత్తర ద్వార దర్శనం నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు సిద్ధం చేశారు. సోమవారం తెల్లవారు జామున నుంచే భక్తులు స్వాముల వారిని ఉత్తర ద్వారం గుండా దర్శనం చేసుకోవడానికి నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు.ఆలయాలను విద్యుద్దీపాలతో అలంకరించారు.

ఎంపీ చొరవతో బోరు




నంద్యాలంపల్లె గ్రామంలో బోరు వేస్తున్న దృశ్యం

సింహాద్రిపురం : నంద్యాలంపల్లె గ్రామంలో ఇటీవల ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నప్పుడు స్థానికులు నూతన బోరు వేయించాలని ఎంపీని కోరగా రెండు రోజులలో బోరు వేయిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం జనవరి 1వ తేదీన నంద్యాలంపల్లె గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుల ఆధ్వర్యంలో బోరు వేయడంతో పుష్కలంగా నీరు పడ్డాయి. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ ఎంపీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఎర్రగుంట్లలో నిఘా నేత్రాలు

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న ప్రధాన కూడళ్లలో సుమారు 35 సీసీ కెమెరాలతో నిఘా ఉంచారు. పట్టణ సీఐ మంజునాథ్‌రెడ్డి సారథ్యంలో ఎర్రగుంట్ల, చిలంకూరు, పోట్లదుర్తి, హనుమనుగుత్తి గ్రామాలలో 35 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



డైరీని ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం, పీఎస్‌టీయూ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని డిప్యూటీ సీఎం అంజాద్‌బాష పేర్కొన్నారు. ఆదివారం కడపలోని డిప్యూటీ సీఎం క్యాంపు కార్యాలయం వద్ద ప్రగతిశీల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం(పీఎస్‌టీయూ)–2023 సంవత్సరానికి సంబంధించిన డైరీని రాష్ట్ర అధ్యక్షులు జమాల్‌రెడ్డి అధ్యక్షతన ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పోచంరెడ్డి సుబ్బారెడ్డి, పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి ఎలియాస్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు పివి సుబ్బారెడ్డి, జిల్లా గౌరవాధ్యక్షుడు రామలక్ష్మిణరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు రామాంజనేయరెడ్డి, జిల్లా సీపీఎస్ కో కన్వీనర్ రామ్మోహన్‌రెడ్డి, బాల్రెడ్డి వెంకటరామిరెడ్డిలు పాల్గొన్నారు.

అన్నదానం

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరంలోని పలు ప్రాంతాల్లో ఎలాంటి ఆసరా లేని వృద్ధులు, యాచకులకు జన వికాస్ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని అన్నదానం చేశారు.

మాట తప్పని.. మడమ తిప్పని సీఎం వైఎస్ జగన్

పులివెందుల టౌన్ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికలకు ముందు ఇచ్చిన వాగ్దానం ప్రకారం వృద్ధాప్య పింఛన్ రూ.2 వేల నుంచి పెంచుకుంటూ రూ.2,750లు చేసి మాట తప్పని.. మడమ తిప్పని సీఎంగా మాట నిలబెట్టుకున్నారని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని పార్నపల్లె రోడ్డు కూరగాయల మార్కెట్ సమీపంలో ఉన్న శ్రీరామ టెంపుల్ సచివాలయంలో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. అంతకముందు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటానికి అవ్వాతాతలతో కలిసి వారు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో ఉన్నారన్నారు. శ్రీరామ టెంపుల్ సచివాలయం ప్రతి కార్యక్రమంలో జిల్లాలో ఫస్ట్‌లో ఉందని.. వారు జగనన్న వారధులను అభినందించారు. అలాగే పలు వార్డులలో నూతన పింఛన్ దారులకు డబ్బులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డి, 26వ వార్డు కౌన్సిలర్ లక్ష్మీప్రసన్న, వైఎస్సార్సీపీ నాయకులు వీరారెడ్డి, పద్మనాభరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ హాఫీజ్, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, కౌన్సిలర్లు కోడి రమణ, పార్నపల్లె కిశోర్, వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రీనివాసులు, వలంటీర్లు విజయ్‌కుమార్‌రెడ్డి, ఎం.లక్ష్మీదేవి, విజయలక్ష్మి, రవిచంద్ర, తదితరులు పాల్గొన్నారు.



పులివెందుల : సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న వృద్ధురాలు



పులివెందుల : జై జగన్ అంటూ నినాదాలు చేస్తున్న పింఛన్ లబ్ధిదారులు

పులివెందుల రూరల్ : మండల పరిధిలోని నల్లపురెడ్డిపల్లె గ్రామంలో పింఛన్‌దారులు పింఛన్ పెంపుపై హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం పింఛన్ లబ్ధిదారులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వృద్ధులు జై జగన్.. జై జై జగన్ అంటూ నినాదాలు చేశారు. అలాగే సుంకులమ్మపేటలో దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పాలాభిషేకం చేశారు.

వేంపల్లె : మండల వ్యాప్తంగా అవ్వ, తాతలకు పెంచిన పింఛన్లు అందిస్తున్నట్లు ఎంపీపీ ఎస్.లక్ష్మీగాయత్రి పేర్కొన్నారు. వలంటీర్లు తెల్లవారకముందే తలుపు తట్టి మరీ పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. ఆదివారం తదితర అర్హులైన పింఛన్ లబ్ధిదారులకు రూ.2,750లు ఎంపీపీ చేతులమీదుగా అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటివరకు ప్రతినెలా రూ.2,500ల చొప్పున అందుకుంటున్న పింఛన్‌దారులు ఇప్పటి నుంచి ప్రతినెలా రూ.2,750ల చొప్పున అందిస్తారన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల : పట్టణంలోని మొత్తం 3,033 పింఛన్‌లు ఉండగా ఈ ఏడాది 152 పింఛన్‌లు కొత్తగా రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. ఆదివారం కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జిలు, వలంటీర్లు వారి క్లస్టర్‌పరిధిలోని పింఛన్‌దారుల ఇంటి వద్దకు వెళ్లి రూ.2,750 నగదును అందజేశారు.

సింహాద్రిపురం : మండల వ్యాప్తంగా 167 నూతన పింఛన్లు మంజూరయ్యాయి. జనవరి 1వ తేదీన పింఛన్ మూడవ విడత కింద రూ.250 పెంచి రూ.2,750 పంపిణీ చేశారు. ఆదివారం గురిజాల సచివాలయ పరిధిలోని వైఎస్సార్‌సీపీ నాయకుడు కరుణాకర్‌రెడ్డి చేతులమీదుగా నూతన పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

పెద్దముడియం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పేద ప్రజలకు ఎంతో భరోసా కలుగుతోందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చవ్వా కృష్ణారెడ్డి తెలిపారు. ఆదివారం ఉదయం పెద్దముడియం గ్రామంలో వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.
అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పింఛన్ అందుతోందన్నారు. మండల వ్యాప్తంగా 4,848 పింఛన్లు ఉండగా 90 శాతం పింఛన్లు పంపిణీ చేశామని మిగతావి నేడు పంపిణీ చేస్తామని ఎంపీడీఓ వెంకట రమణయ్య తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గ్యాస్ శివారెడ్డి, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వేంపల్లె : పెంచిన పింఛన్‌ను అందిస్తున్న ఎంపీపీ లక్ష్మీగాయత్రి, తదితరులు



ఎర్రగుంట్ల : శాంతినగర్‌లో పింఛన్‌ను అందజేస్తున్న వలంటీర్ లక్ష్మీదేవి



సింహాద్రిపురం : పింఛన్ దారులకు డబ్బులు పంపిణీ చేస్తున్న కరుణాకర్‌రెడ్డి, తదితరులు



పెద్దముడియం : పింఛన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న మండల కన్వీనర్ చవ్వా కృష్ణారెడ్డి

నేడు వైకుంఠ ఏకాదశికి

ఆలయాల ముస్తాబు



వేంపల్లెలో వీరాంజనేయస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన ఉత్తర ద్వారం



వీఎన్‌పల్లె: ముస్తాబయిన వెంకటేశ్వర స్వామి ఆలయం

వేంపల్లె : సోమవారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా మండలంలో ఆలయాలు ముస్తాబయ్యాయి. పట్టణంలోని శ్రీలక్ష్మీవృషభాచలేశ్వరస్వామి ఆలయానికి అనుసంధానమైన శ్రీవీరాంజనేయస్వామి దేవస్థానం, వెంకటేశ్వరస్వామి ఆలయం, మెయిన్ బజార్‌లోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరిస్వామి ఆలయాల వద్ద ఉత్తర ద్వారాలు ఏర్పాటు చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా స్వామిని దర్శించుకునేందుకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఆలయాల వద్ద చలువ పందిళ్లు, విద్యుద్దీపాలంకరణ, పూలమాలతో డెకరేషన్ చేయించారు. నేడు భక్తులందరికీ ఉత్తర ద్వారం గుండా స్వామి వారు దర్శనమిస్తారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ శ్రీధర్, చైర్మన్ కె.వెంకటేష్, కన్యకాపరమేశ్వరి ఆలయ అధ్యక్షుడు వి.రాజారావులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

జమ్మలమడుగు రూరల్ : పట్టణంలో వైకుంఠ ఏకాదశికి స్థానిక టీటీడీ శ్రీనారాపుర వెంకటేశ్వరస్వామి దేవాలయంలో ఏర్పాట్లను అధికారులు పూర్తిచేశారు. సోమవారం ఉదయం 5 గంటలకు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం భక్తులకు దర్శనం కల్పిస్తారని ఆలయ అధికారి మోహన్ తెలిపారు. భక్తుల కొరకు ప్రత్యేక క్యూ ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు.

వీరపునాయునిపల్లె: మండల పరిధి ఉరుటూరు గ్రామంలోని శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో వైకుంట ఏకాదశి సందర్భంగా భక్తులకు సోమవారం ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేసినట్లు ఆలయ అర్చకులు ఉమామహేశ్వర శర్మ తెలిపారు.

భక్తులకు వైకుంట ద్వార దర్శనం కల్పించడం జరుగుతుందన్నారు. ఉదయం 8 గంటలకు శివాలయం నుంచి వెంకటేశ్వరస్వామి ఆలయం వరకు గోవిందనామ స్మరణ చేస్తూ 108 కళశములతో గ్రామోత్సవం, 9 గంటలకు టీటీడీ వారిచే అన్నమాచార్య కీర్తనలు, 10.25 గంటలకు శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి వారి కల్యాణ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

ప్రముఖులకు దేవదాయ శాఖ సత్కారం

కడప కల్చరల్ : జిల్లా కలెక్టర్ వి.విజయరామరాజు, కమలాపురం శాసనసభ్యులు పి.రవీంద్రనాథ్‌రెడ్డిలను ఆదివారం జిల్లా దేవదాయ శాఖ ఆధ్వర్యంలో అసిస్టెంట్ కమిషనర్ శంకర్‌బాలాజీ, కడప గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ ఈఓ ఎ.శ్రీధర్‌లు ఘనంగా సత్కరించారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని తొలుత కలెక్టర్‌ను కలిసిన ఈ బృందం వేదపండితులు విజయ్‌భట్టర్ తదితరులు ఆయనకు వేదోక్తంగా ఆశీస్సులు, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆ శాఖ ఏసీ శంకర్ బాలాజీ తమ శాఖ సాధించిన విశేషాలను క్లుప్తంగా వివరించారు. అనంతరం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషను కూడా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. తొలుత ఆయనను ఘనంగా సత్కరించి దేవదాయ శాఖ ప్రచురించిన క్యాలెండర్లను అందజేశారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, ఆయన తనయుడు సీకే దిన్నె జెడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డిని జిల్లా దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ శంకర్‌బాలాజీ కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు. అనంతరం ఆ శాఖ ప్రచురించిన జిల్లా పుణ్యక్షేత్రాలు, ప్రముఖ ఆలయాలతో కూడిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను వారు ఆవిష్కరించారు. వేద పండితులు విజయ్‌భట్టర్ బృందం వారికి వేదాశీస్సులు, తీర్థ ప్రసాదాలు అందజేసింది.

వైఎస్సార్‌సీపీ నేతలకు శుభాకాంక్షలు తెలిపిన కార్యకర్తలు



వైఎస్ భాస్కర్‌రెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు, కార్యకర్తలు



వైఎస్ మనోహర్‌రెడ్డికి పూల మొక్కను అందిస్తున్న మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, కార్యకర్తలు



వైఎస్ మధురెడ్డికి పూల బొకేను అందిస్తున్న మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, తదితరులు

పులివెందుల : నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని పట్టణంలోని వైఎస్సార్‌సీపీ నేతలైన నియోజకవర్గ ఇన్‌చార్జి వైఎస్ భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, తొండూరు మండల ఇన్‌చార్జి వైఎస్ మధురెడ్డిలను ఆదివారం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు వారివారి స్వగృహాలలో కలిసి పూల బొకేలను, మొక్కలను అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన సంవత్సరంలో ప్రజలు, రైతులు సుఖసంతోషాలతో ఆయురారోగ్యాల తో జీవించాలని దేవుడిని ప్రార్థించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మున్సిపల్ వైస్ చైర్మన్ హాఫీజ్, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు కోడి రమణ, పార్నపల్లె కిశోర్, ఖాదర్ బాషా, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

పులివెందుల టౌన్ : ఆంగ్ల నూతన సంవత్సర వేడుకలు పులివెందులలో ఘనంగా నిర్వహించారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ప్రజలు తమ స్నేహితులకు, ప్రియతమ నాయకులకు, బంధువులకు హ్యాపీ న్యూ ఇయర్ తెలుపుకున్నారు. బేకరీలలో కేక్‌లు, స్వీట్లు కొనేందుకు బారులు తీరారు. నూతన సంవత్సరం సందర్భంగా ఆలయాలకు వె ళ్లారు. అలాగే స్థానిక శిల్పారామంలో ఆదివారం సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. బావర్చి రెస్టారెంట్ సౌజన్యంతో మాస్టర్ యువకిశోర్ ఆధ్వర్యంలో చిన్నారులు జానపద, శాస్త్రీయ, సినీ పాటలకు నృత్య ప్రదర్శనలు చేసి ఆకట్టుకున్నా రు. కార్యక్రమంలో శిల్పారామ పరిపాలనాధికారి సుధాకర్, సేవా సమితి అధ్యక్షుడు రాజు, డ్యాన్స్ మాస్టర్ యువకిశోర్ తదితరులు పాల్గొన్నారు.

కమలాపురం : మండల ప్రజలు శనివారం అర్ధరాత్రి 12 గంటల నుంచే ఉత్సాహంగా నూతన సంవత్సరానికి ఘనంగా స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలుపుకుని కేక్‌లు కట్ చేసి పంచి పెట్టారు. ఆదివారం ఉదయం ఆలయాలకు చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే పెద్దదర్గాలో పీఠాధిపతి శ్రీ హజరత్ ఫైజుల్ గఫార్ షా ఖాద్రి ఆధ్వర్యంలో స్వర్గీయ పీఠాధిపతి జహీరుద్దీన్ షా ఖాద్రి జయంతిని పురస్కరించుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, కేక్ కట్ చేసి భక్తులకు పంచి పెట్టారు. అలాగే చర్చిలలో ఆయా ఫాస్టర్ల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సాయంత్రం చర్చిల ప్రాంగణంలో తదితర ఆటలను పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. టీసీసీ చర్చిలో సంఘ సభ్యులు కొర్రపాటి దానమ్మ తన భర్త రాజశేఖర్ జ్ఞాపకార్థం పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు.

వీరపునాయునిపల్లె : స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో, మండల పరిషత్ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల కన్వీనర్ రఘునాథరెడ్డి కేక్ కట్ చేశారు. మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

వేముల : గ్రామీణ ప్రాంతాల్లోని యువకులు నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ బాణా సంచా పేల్చుతూ ఆనందోత్సాహాల మధ్య వేడుకలు జరుపుకున్నారు. ఆదివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఎంపీపీ చల్లా గంగాదేవి అధికారులతో కలిసి కేక్ కట్ చేశారు. అలాగే ఆలయాలలో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



పులివెందుల : శిల్పారామంలో శాస్త్రీయ నృత్యంలో చిన్నారులు



సందర్శకులతో కిటకిటలాడుతున్న శిల్పారామం

జమ్మలమడుగు : పట్టణంలో ఘనంగా నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఆర్డీఓ జి.శ్రీనివాసులను రెవెన్యూ ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు. పోలీసు శాఖ అధికారులు సైతం డీఎస్పీ నాగరాజుకు శుభాకాంక్షలను తెలియజేశారు. ఆస్థానయే గౌసియా పీఠాధిపతి సయ్యద్ షా గౌస్‌పీరా ఖాద్రీ తనయుడు సయ్యద్ షా తాహీర్ పీరాఖాద్రీ, మనవడు అమన్ ఖాద్రీలు డీఎస్పీ నాగరాజు, అర్బన్ సీఐ సదాశివయ్యలకు శుభాకాంక్షలను తెలియజేశారు.

వేంపల్లె : నూతన సంవత్సరం సందర్భంగా స్థానిక నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రఓబుళరెడ్డి, ఎంపీపీ లక్ష్మీగాయత్రి, సర్పంచ్ శ్రీనివాసులులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

పెండ్లిమర్రి : నూతన సంవత్సరం వేడుకలను ఆదివారం మండల ప్రజలు సంతోషంగా జరుపుకున్నారు. మండలంలోని కొందరు భక్తులు ఉదయాన్నె భక్తులు స్నానాలు అచరించి నూతన వస్త్రాలు ధరించి సమీపంలోని అలయాలకు వెళ్లి స్వాముల వారికి ప్రత్యేక పూజలు చేశారు.

చెన్నూరు : నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని మండల ప్రజలు ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్ ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధుల, అధికారులతో కలిసి కేక్‌కట్ చేసి పంచిపెట్టి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జీఎన్‌భాస్కర్‌రెడ్డి, ఎంపీడీఓ గంగనపల్లి సురేష్‌బాబు, మండల ఉపాధ్యక్షుడు ఆర్ఎస్ఆర్, వైఎస్సార్‌సీపీ నాయకులు నీలం శ్రీనివాసులురెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు, ఇతర ప్రజా ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

సీబీఆర్ వద్ద పర్యాటకుల సందడి

లింగాల : మండలంలోని అన్ని గ్రామాల్లో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకుని కేకలు కట్ చేసి జనవరి 1కి స్వాగతం పలికారు. వైఎస్సార్‌సీపీ మండల యూత్ కన్వీనర్ మనోహర్‌రెడ్డి, వైఎస్సారసీపీ కడప పార్లమెంటరీ కన్వీనర్ సారెడ్డి చంద్రశేఖరరెడ్డి, గండి క్షేత్ర కమిటీ మెంబర్ అంకాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వైఎస్ భాస్కర్‌రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే పార్నపల్లె చిత్రావతి బ్యా లెన్సింగ్ రిజర్వాయర్ వద్దకు పర్యాటకులు ఆదివా రం భారీగా తరలి వచ్చారు. అనంతపురం, కడపజిల్లాల నుంచి సీబీఆర్‌లో బోటింగ్ చేసేందుకు వందలాది మంది పర్యాటకులు సీబీఆర్ వద్దకు చేరుకున్నారు.

వల్లూరు : మండలంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. శనివారం అర్ధరాత్రి వరకు ఆలయాల్లో భజనలతో, చర్చిలలో ప్రార్థనలతో గడిపారు. ఆదివారం ఆలయాలకు, చర్చిలకు, మసీదులకు వెళ్లి ప్రార్థనలు చేశారు. కేక్‌లను కట్ చేసి ఒకరికి ఒకరు శుభాకాంక్షలను తెలుపుకున్నారు. అధికారులను, రాజకీయ నేతలను కలిసి శుభాకాంక్షలను తెలిపారు.



లింగాల : సీబీఆర్ వద్ద బోటింగ్‌కు వెళుతున్న పర్యాటకులు



కమలాపురం : సీఎస్ఐ చర్చిలో గోనె సంచుల పరుగు పోటీలో పాల్గొన్న యువకులు

ఆర్టీసీ చైర్మన్‌ను కలిసిన ఉద్యోగ సంఘం నేతలు



ఆర్టీసీ చైర్మన్‌కి శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఆర్టీసీ అసోసియేషన్ నాయకులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీ వైఎస్సార్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు జిల్లాకు చెందిన ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్‌తోపాటు పలువురు ప్రజాప్రతినిధులను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఆదివారం అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు చల్లా చంద్రయ్య, ఉపాధ్యక్షులు బాబా ఫక్రుద్దీన్‌లు ఇతర నాయకులతో కలిసి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాష, కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, ఆయన తనయుడు సీకే దిన్నె జెడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి, ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డిలను కలిసి సన్మానించి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి

కడప అర్బన్: కడప నగర శివార్లతోపాటు సబ్ డివిజన్ పరిధిలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను దృష్టిలో పెట్టుకుని ఈ నెల 2వ తేదీ నుంచి పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించనున్నట్లు కడప డీఎస్పీ బి.వెంకట శివారెడ్డి తెలియజేశారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆటోడ్రైవర్లు యూనిఫాం, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ సర్టిఫికెట్ కలిగి వుండాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఆటోలో చేరవేయడం నిషేధమన్నారు. మోటార్ సైకిల్‌లో ట్రిపుల్ రైడింగ్ చేసే వారిపైన చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుని అపరాధ రుసుం వసూలు చేస్తామని వివరించారు.